క్లుప్తంగా

ఐటీఐలలో నాల్గవ విడత కౌన్సెలింగ్

తెనాలిఅర్బన్: జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లభర్తీకి నాల్గవ విడత నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్, తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రావి చినవెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19లోపు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ పేరు నమోదు చేయించుకోవాలన్నారు. తెనాలి, గుంటూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రంలో అదే రోజు సాయంత్రం ఐదుగంటల లోపు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో హాజరు కావాలని సూచించారు. ఈ నెల 22న ఉదయం తొమ్మిది గంటలకు అన్ని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేయనున్నట్లు చెప్పారు. వివరాలకు 9347795839, 9014491772 నెంబర్‌లలో సంప్రదించాలన్నారు.

9న తెనాలిలో సాహిత్య సభ

తెనాలిఅర్బన్: తెనాలి సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో బొల్లిముంత వీరయ్య కవితా సంపుటాల ఆవిష్కరణ, సాహిత్య సభను ఈ నెల 9న తెనాలిలో నిర్వహించనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో నిర్వాహకులు తెలిపారు. నందులపేట కవిరాజాపార్కులోని సీనియర్ సిటిజన్స్ హాల్‌లో సాయంత్రం 4.30 గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. సభకు రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లిముంత సాంబశివరావు అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్య అతిథులుగా కవి జుగాష్ విలి, ప్రజాగాయకుడు కనపర్తి బెన్‌హర్, రచయితలు చందు నాగేశ్వరరావు, బొల్లిముంత వీరయ్యలు పాల్గొంటారని చెప్పారు. సాహితీ ప్రియులు పాల్గొనాలని కోరారు.

ఖాళీ స్థలాల్లో మెరక తొలుకోండి

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని ఖాళీ స్థలాల్లో మురుగు నీరు చేరి వ్యాధులకు కారణంగా మారుతున్నాయని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీ స్థల యజమానులందరూ తమ స్థలాల్లో మెరక తోలించుకోవాలని సూచించారు. స్థలాల్లో మురుగు చేరడం వలన దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలు పాటించని యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే గోవులను పెంచుకునే వారు వాటిని రోడ్లపై వదలవద్దని సూచించారు. వాటిని వదలడం వలన రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. రోడ్లపై వదిలే ఆవులను పట్టుకుని శ్రీశైలం గోశాలకు తరలించడం జరుగుతుందని హెచ్చరించారు.

గ్రామ సచివాలయంలో ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో

కొల్లిపర: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించేందుకు సచివాలయం ఉద్యోగులు నిష్పక్షపాతంగా పనిచేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వి.చంద్రమోహన్ సూచించారు. గురువారం స్థానిక గ్రామ సచివాలయం 1 లో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఉద్యోగులు ఏవిధంగా ప్రజలను రిసీవ్ చేసుకుంటున్నారు, రికార్డులు ఏవిధంగా ఉన్నాయి అన్న అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ భీమవరపు మధుసూధనరెడ్డి , సచివాలయం సిబ్బంది ఉన్నారు.

చరిత్ర అధ్యాపకుడు ప్రకాశంకు పీహెచ్‌డీ

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లికి చెందిన చరిత్ర అధ్యాపకుడు బెజ్జం ప్రకాశంకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గురువారం పీహెచ్‌డీని ప్రదానం చేసింది. ఆయన దళిత్ రిలీజియస్ కన్వర్షన్స్ అండ్ కాన్సీక్వెన్సెస్ – హిస్టోరికల్ పర్స్పెక్టివ్ అనే అంశం మీద పరిశోధన చేశారు. ఈ అంశానికి నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి ప్రకాశంకు సూపర్ వైజర్‌గా వ్యవహరించారు. ఆయన ప్రస్తుతం విజయవాడ నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగ అధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టరేట్ పొందిన ప్రకాశంను పలువురు నగర వాసులు అభినందించారు.

9న గుంటూరులో యానాదుల రాజకీయ భేరి

నెహ్రూనగర్: యానాదుల పొలిటికల్ ఫోరం ఆధ్వర్యంలో గుంటూరులో ఈ నెల 9న యానాదుల రాజకీయ భేరి బహిరంగ సభ బీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు యానాదుల పొలిటికల్ ఫోరం రాష్ట్ర కన్వీనర్లు కేసీ కల్లూరు చిన పెంచలయ్య, యందేటి వెంకట సుబ్బయ్యలు తెలియజేశారు. ఈ మేరకు గురువారం అంబేడ్కర్ భవన్‌లో రాజకీయ భేరి బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పది లక్షల జనాభా కలిగిన యానాదులకు ప్రత్యే క కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఎమ్మెల్సీ పదవి కేటాయించి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల బ్రహ్మయ్య, కె.సూరిబాబు, పొన్నూ రు అంకమ్మరావు, మన్యం కోటయ్య, ఆర్ మధు, శ్రీనివాసులు, రాజు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

పట్టణంలోని శ్రీకృష్ణ మందిరాల్లో పూజలు



రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీకృష్ణ మందిరంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, బీసీ సంఘ నాయకులు గంగాయాదవ్ తదితరులు

తెనాలిఅర్బన్: కృష్ణాష్టమి వేడుకలను తెనాలి పట్టణంలో గురువారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ కృష్ణ మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ మందిరాలను అందంగా అలంకరించారు. వేడుకల్లో భాగంగా పలు చోట్ల అన్నదానాలు నిర్వహించారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ కృష్ణ మందిరంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పూజలు చేశారు. ఆయనకు బీసీ సంఘ నాయకులు మేడిబోయిన గంగాయాదవ్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు బచ్చనబోయిన శ్రీనివాసరావులు స్వాగతం పలికారు. శ్రీ కృష్ణుని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ గోపాలకృష్ణ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఆలయానికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. ఎమ్మెల్యే శివకుమార్ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, దేసు శ్రీనివాసరావు, కఠారి హరీష్, బూరెల దుర్గా, కుక్కల ముక్తేశ్వరరావు, కౌన్సిలర్లు తోట రఘురామ్, పేరం సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. త్రైత సిద్ధాంతం గుంటూరు వారి ఆధ్వర్యంలో మారీసుపేటలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని కృష్ణునికి పూజలు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

కుమార్‌పంప్స్ సంస్థలో ..

తెనాలి: స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని కుమార్ పంప్స్ ఫ్యాక్టరీలో గురువారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత సత్సంగం నిర్వహించారు. అనంతరం రాధాకృష్ణ విగ్రహాలకు కొత్త సుబ్రహ్మణ్యం దంపతులు పాలాభిషేకం, పూజలు నిర్వహించారు. కార్మికులతో కలిసి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కుమార్ పంప్స్‌లోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఇస్కాన్ టెంపుల్ నిర్వాహకులు సింహ గౌరదాస్, గోపీనాథ్‌ప్రియదాస్‌లు పూజా కార్యక్రమాలను జరిపించారు.



మారీసుపేటలో ఎమ్మెల్యే శివకుమార్

త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో ..

తెనాలి: త్రైత సిద్ధాంతం వారి ఆధ్వర్యంలో రెండు రోజుల శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం సాయంత్రంతో ముగిశాయి. స్థానిక మారీసుపేటలోని అప్పలస్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై వేడుకలను నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం నుంచి స్వామివారి ఊరేగింపు పట్టణంలో ఘనంగా జరిగింది. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వీరితో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కఠారి హరీష్, షేక్ దుబాయ్‌బాబు, స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు తన్నీరు శ్రీనివాసబాబు ఉన్నారు. ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక పర్యవేక్షించిన వేడుకల్లో ఆయా సంస్థల గుంటూరు జిల్లా అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు, సభ్యులు కృష్ణారావు, పరిమళ, శ్రీనివాస్, రామకృష్ణ, శివలింగం, హరిబాబు, శ్రీదేవి, రేణుక, దుర్గ, దిల్షా, శ్రీలక్ష్మి, మహాలక్ష్మి, విద్య పాల్గొన్నారు.



బుర్రిపాలెం రోడ్డులోని శ్రీకృష్ణ మందిరంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్



పాలాభిషేకం చేస్తున్న కొత్త సుబ్రహ్మణ్యం దంపతులు

రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి

కొల్లిపర: ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని, కల్తీ లేని ఆహార ధాన్యాలు పండించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటరావు అన్నారు. గురువారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ప్రకృతి వ్యవసాయంపై మండలంలోని డ్వాక్రా గ్రూపుల వీఓఏఎస్, ఐసీఆర్‌పీఎస్‌లకు ట్రైనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతిలో లభ్యమయ్యే వనరుల ద్వారా వ్యవసాయం చేయాలని, జీరో బడ్జెట్ వ్యవసాయం చేయాలని , మహిళలు ఇంట్లో కిచెన్ గార్డెన్స్ ద్వారా కూరగాయలు పండించాలని కోరారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ డీపీఎం జి.వి.ఎస్. జానకి, మానిటరింగ్ అధికారి సత్యనారాయణరావు, ఏపీఎం డి.బి.ప్రియదర్శిని, సిబ్బంది సుధ, నాగలక్ష్మి, డ్వాక్రా గ్రూపుల వీఓఏఎస్, ఐసీఆర్‌పీఎస్ పాల్గొన్నారు.



డ్వాక్రా గ్రూపుల వీఓఏఎస్, ఐసీఆర్‌పీఎస్‌లకు వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయం డీపీఎం వెంకటరావు

జైళ్ల సంస్కరణపై ప్రభుత్వం దృష్టి

శిథిలావస్థకు చేరుకున్న సబ్‌జైలు మూసివేత

తెనాలిరూరల్: తెనాలి సబ్‌జైలును అధికారులు మూసివేశారు. సబ్‌జైలు భవన సముదాయం శిథిలావస్థకు చేరుకోవడంతో అధునాతన భవనాన్ని నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో జైలులో ఉన్న ఖైదీలు ఆరుగురిని రేపల్లె సబ్‌జైలుకు, 12 మందిని బాపట్ల సబ్‌జైలుకు తరలించారు. ప్రస్తుతం ఉన్న సబ్‌జైలును బ్రిటిష్ పాలకులు 1912లో నిర్మించారు. శిథిలావస్థకు చేరుకున్న భవన సముదాయంలోనే ఖైదీలు ఉంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జైళ్ల సంస్కరణపై దృష్టి సారించింది. ఈ క్రమంలో సుమారు 110 ఏళ్ల క్రితం నిర్మించిన తెనాలి సబ్‌జైలు స్థానంలో అధునాతన సౌకర్యాలతో కూడిన జైలును నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో జైళ్ల శాఖ డీజీ అహసన్ రెజా తెనాలి జైలును గతేడాది సెప్టెంబరులో పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, నీటి సౌకర్యం సరిగాలేదని ఖైదీలు వీరి దృష్టికి తెచ్చారు. రూ. 2.50 కోట్ల బడ్జెట్‌తో అధునాతన భవనాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న సబ్‌జైలుకు అవకాశం ఉన్న మేర అదనంగా కొంత స్థలాన్ని సమకూర్చి దేశంలోనే మోడల్ జైలుగా తెనాలి సబ్‌జైలు నిర్మాణం జరుగనుంది. ఇప్పటికే అన్ని అనుమతులు లభించడంతో జైలును మూసివేశారు. మరి కొద్ది రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.



శిథిలావస్థకు చేరుకున్న సబ్‌జైలు భవనసముదాయము

కరకట్టలోకి జారిన ఆర్టీసీ బస్సు

- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెనుప్రమాదం
- దుగ్గిరాల మండలం గొడవర్రు వద్ద ఘటన

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని గొడవర్రు వద్ద ఆర్టీసీ బస్సుకు పెనుప్రమాదం తప్పింది. గురువారం విజయవాడ నుంచి రేపల్లె వెళ్లే ఆర్టీసీ బస్సు అదుపుతప్పి కరకట్ట కిందకు జారింది. డ్రైవర్ అప్రమత్తమై బస్సు బోల్తా పడకుండా నియంత్రించాడు. వివరాల్లోకి వెళితే.. రేపల్లె డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఉదయం 9 గంటలకు విజయవాడ నుంచి 30 మంది ప్రయాణికులతో రేపల్లెకు వెళుతుంది. గొడవర్రు వద్ద కరకట్ట నిర్మాణం పూర్తిగా జరగకపోవడంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు గోతులమయమైంది. గొడవర్రు వద్ద కరకట్ట మీద ఉన్న గోతులను తప్పించేందుకు ఆర్టీసీ డ్రైవర్ కరకట్ట అంచుభాగానికి రావడంతో బస్సు ఎడమవైపు ఎదురు టైరు జారిపోయింది. వెనుక టైరు కూడా జారడంతో డ్రైవర్ అప్రమత్తమై కరకట్ట కిందకు దిగుతున్న బస్సు స్టీరింగ్‌ను కుడివైపునకు తిప్పడంతో బస్సు బోల్తా పడకుండా కట్టపై భూమికి ఆనుకుని నిలిచిపోయింది. అంతలో బస్సులో ఉన్న ప్రయాణికులు పెద్ద పెద్దగా కేకలు వేయడంతో అక్కడే ఉన్న ఎంపీటీసీ కొండూరు సుమన్ గ్రామస్తుల సహాయంతో ఆర్టీసీ బస్సు ఎమర్జెన్సీ డోరు తీసి స్థానికుల సహాయంతో 30 మంది ప్రయాణికులను కిందికి దించారు. వెంటనే ఇరిగేషన్ అధికారులు కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసును పరిష్కరించి రోడ్డు నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేశారు.



గొడవర్రు వద్ద కరకట్ట కిందకు వాలిపోయిన ఆర్టీసీ బస్సు



ఎమర్జెన్సీ ద్వారం నుంచి ప్రయాణికులను కిందకు దించుతున్న స్థానికులు

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు

తాడికొండ: నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఎంపీడీఓలు, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాగునీటి, రోడ్ల సమస్యలు ఎక్కడైనా ఉంటే గుర్తించి తక్షణ పరిష్కారం చేయాలని సూచించారు. వివిధ పనులపై కార్యాలయాలకు వచ్చే ప్రజలకు జవాబుదారీ పాలన అందించాలన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో నిధులు మంజూరై ప్రారంభం కాకుండా ఉంటే ఆయా పనులను వెంటనే ప్రారంభించడంతో పాటు నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలు, రోడ్లు త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. మండలాల పరిధిలోని పలు పనులు, ఇతర వివరాలను అడిగి తెలుసుకొని అధికారులకు పలు సూచనలిచ్చారు. 4 మండలాల ఎంపీడీఓలు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్యరహిత వాతావరణంలోనే స్వచ్ఛమైన గాలి

గుంటూరు ఎడ్యుకేషన్: కాలుష్యానికి తావులేని వాతావరణంతోనే స్వచ్ఛమైన గాలిని పీల్చగలమని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ప్రపంచ స్వచ్ఛ వాయువు దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గంగాధర్ మాట్లాడుతూ మన ఆరోగ్యం స్వచ్ఛంగా ఉండాలి అంటే వాతావరణం కలుషితం కాకుండా చూడాలని, ప్రాణ కోటికి అతి ముఖ్యమైన వాయువును శుభ్రంగా చూసుకునే బాధ్యత మనందరి పైన ఉందని పేర్కొన్నారు. వాతావరణ కాలుష్యం కలిగించే వాహనాలను ఉపయోగించవద్దని సూచించారు. ఐటీసీ పర్యావరణ సమన్వయకర్త నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి బాధ్యతగా ఇంటికి ఒక చెట్టును నాటి, పరిరక్షించాలని, అటువంటప్పుడు పరిశుభ్రమైన వాయువు సమాజానికి ఇవ్వగలుగుతామని సూచించారు.

చర్మకారుల సమస్యలు పరిష్కరించాలి



నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న చర్మకారులు, డప్పు కళాకారులు

మంగళగిరి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగరంలో చర్మకారులు, డప్పు కళాకారులు గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సెంటర్, కొత్త బస్టాండ్ సెంటర్‌లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవనరామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు స్థానిక పెన్షనర్స్ హోమ్‌లో చర్మకారులు, డప్పు కళాకారుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ చర్మకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బుల్లా రాజారావు, దున్న నాగయ్య, గుంటూరు, కృష్ణా జిల్లాల చర్మకార సంక్షేమ సంఘం నాయకులు ప్రశాంతి, బుల్లా త్యాగరాజు పాల్గొన్నారు.

అధికారుల అలక్ష్యం.. ప్రజలకు కష్టం



ఆర్‌ఆర్‌నగర్ 60 అడుగుల రోడ్డులో నీరు లీకవుతున్న దృశ్యం



ఎనిమిది నెలలుగా తవ్వి వదిలేసిన సీసీ రోడ్డు

- వాపోతున్న స్థానికులు
- నెలల తరబడి పైపులైన్ మరమ్మతులతో ప్రజలకు ఇక్కట్లు

తెనాలిరూరల్: అధికారుల అలక్ష్యం ప్రజలను కష్టాల పాలు చేస్తోంది. మరమ్మతు పనులలో పర్యవేక్షణా లోపంతో ఇబ్బందులు తప్పడం లేదు. రక్షిత మంచినీటి పథకం పనులు ప్రజలకు ఆది నుండి తలనొప్పిగా మారాయి. పైపులైన్ల కోసం రోడ్లను తవ్వడం దగ్గర నుండి ఇళ్లకు ఇచ్చే కుళాయి కనెక్షన్ల వరకు ప్రజలకు అన్నీ కష్టాలే. పథకం కోసం పనులు ప్రారంభించిన తొలి నాళ్లలో పగులగొట్టిన రోడ్ల వల్ల ఇప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదు. రక్షిత మంచినీరు సంగతేమో కానీ ప్రజల ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పట్టణ మారిస్‌పేట ఆర్.ఆర్ నగర్‌లోని రాజీవ్‌గృహకల్ప వద్ద నుండి 60 అడుగుల రోడ్డు, వెలువోలు వారి వీధి మీదుగా 21వ వార్డుకు గతేడాది పైపులైను వేశారు. ప్రధాన పైపులైను కోసం రోడ్డును పగులగొట్టే సందర్భంలో ఇళ్లకు ఇచ్చే కుళాయి కనెక్షన్ల పైపులు తెగిపోయాయి. వీటికి మరమ్మతులు సరిగా చేయించకుండానే కాంక్రీట్‌తో పూడ్చించారు. తాగునీరు సరఫరా చేసే సందర్భంలో ఈ రోడ్డులో నీరు పైకి ఎగజిమ్ముతోంది. స్థానికులు రాళ్లను అడ్డు పెట్టుకున్నారు. రోడ్డంతా నీళ్లు నిలుస్తున్నాయి. ప్రతి రోజు ఉదయం సాయంత్రం నీరు వదులుతుంటారు. ఈ సమయాల్లో 60 అడుగుల రోడ్డు మొత్తం చిత్తడిగా మారుతుంది. బాగున్న రోడ్డును పగులగొట్టడమే కాకుండా సరిగా మరమ్మతులు చేయించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రధాన పైపులైను ఏర్పాటు సందర్భంలోనూ అధికారుల పర్యవేక్షణా లోపం స్పష్టంగా కనబడుతోంది. పైపులైను ఏర్పాటు చేసిననాటి నుండి నీరు లీకవుతోంది. వీటి మరమ్మతులనూ పట్టించుకోవడం లేదు. పైపులైను కోసం రోడ్డును పగులగొట్టి ఎనిమిది నెలలవుతున్నా ఇప్పటికీ సరి చేయలేదు. ఇదే రోడ్డులో ప్రైవేటు పాఠశాల ఉంది. అయినా పైపులైను మరమ్మతుల కోసం తవ్విన గుంతలను నెలల తరబడి పూడ్చడం లేదు. సుమారు ఆరు అడుగుల లోతు ఉంటున్న గోతులు నీళ్లతో నిండి ఉంటున్నాయి. ఈ గోతుల వద్ద ఎటువంటి ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళల్లో ఇటుగా వచ్చే వారు, చిన్నారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్నా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అసలు పైపులైను ఏర్పాటు చేసిన నాడే ట్రయల్ రన్ వేసుకుని లీకేజీలను గుర్తించి ఉంటే ఇలా ఇబ్బందులు పడాల్సిన అగత్యం ఉండేది కాదని స్థానికులు చెబుతున్నారు. పర్యవేక్షణా లోపం కారణంగా నెలల తరబడి ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. దీనిపై మున్సిపల్ ఏఈ రాజును సంప్రదించగా ప్రధాన పైపులైనుకు రెండు చోట్ల మరమ్మతులు పూర్తి చేశామని, మరో చోటు చేయాల్సి ఉందని చెప్పారు. త్వరలో పనులు పూర్తవుతాయని, ఇళ్లకు ఇచ్చే కుళాయి కనెక్షన్లకు ప్రజలే మరమ్మతులు చేయించుకోవాలని స్పష్టం చేశారు.



పైపులైను మరమ్మతుల కోసం తవ్విన గొయ్యి నీటితో నిండి ఉన్న దృశ్యం

'భూ రక్ష'తో వివాదాలకు తెర

తెనాలిరూరల్: జగనన్న భూ రక్ష పథకం ద్వారా భూ వివాదాలకు తెరపడుతుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. తెనాలి మండలం సంగంజాగర్లమూడి గ్రామంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా ఇప్పటికే సర్వే పూర్తి చేసిన భూముల్లో సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు, స్థానిక రైతులతో కలిసి సరిహద్దు రాళ్లకు పూజలు నిర్వహించారు. భూ సమస్యలు, తగాదాల పరిష్కారంతో పాటు రైతాంగానికి మేలు జరిగే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్యే శివకుమార్ తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా భూ సమస్యలు పరిష్కరించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ కార్యక్రమాన్ని తీసుకువచ్చారని చెప్పారు. ఇక మీదట గ్రామంలో భూ వివాదాలు, తగాదాలు ఏవీ ఉండవని అన్నారు. గతంలో సర్వే కోసం ప్రజలు అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చేదని ఇప్పుడు ఆ సమస్యలు ఉండవన్నారు. తహసీల్దార్ కె.రవిబాబు, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, వివిధ విభాగాల అధికారులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



హద్దురాయిని ఏర్పాటు చేయిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

మొదటి ఓటు...బంగారు భవిష్యత్‌కు తొలి మెట్టు

జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

తెనాలి: కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువత మొదటి ఓటును వినియోగించుకోవాలని, జనసేన పార్టీకే ఆ ఓటు వేయాలని కోరుతూ ప్రచార కార్యక్రమాన్ని గురువారం ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. తెనాలిలోని తన నివాసంలో కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువతీ యువకులతో కలిసి ప్రచారపోస్టర్‌ను ఆవిష్కరించారు. వచ్చే ఎన్నికల్లో మొదటి ఓటును వినియోగించుకోనున్న యువతలో చైతన్యం నింపేలా జనసేన పార్టీ రాష్ట్రవ్యాప్త ప్రచారాన్ని గురువారం నుంచి ఆరంభిస్తున్నట్టు చెప్పారు.పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండారు రవికాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు ఇస్మాయిల్ బేగ్, మాజీ కౌన్సిలర్లు హరిదాసు గౌరీశంకర్, షేక్ జాకీర్ హుస్సేన్, పార్టీ నాయకులు పసుపులేటి మురళీకృష్ణ, దివ్వెల మధుబాబు, యర్రు వెంకయ్యానాయుడు పాల్గొన్నారు.



యువతీయువకులతో కలిసి ప్రచార పోస్టరును ఆవిష్కరించిన మనోహర్

స్వచ్ఛత ఆకృతిలో విద్యార్థులు



తెనాలి: స్వచ్ఛతా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక అయితానగర్‌లోని ఎస్ఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 'స్వచ్ఛత్' ఆకృతి (ఇంగ్లిష్ లెటర్స్)లో ఏర్పాటయ్యారు. స్వచ్ఛత ఆవశ్యకత నినాదాలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు రాజకిషోర్ పర్యవేక్షణలో గత కొద్దిరోజులుగా స్వచ్ఛత సేవాకార్యక్రమాలు, అవగాహన, క్విజ్, వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శని, ఆది వారాల్లో షార్ట్ ఫిల్మ్, చిత్రలేఖనం పోటీలు జరుగుతాయని ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్ చెప్పారు. 12వ తేదీన స్వచ్ఛత ప్రదర్శనలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.